



తుంగభద్ర నదిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

కార్పొరేటుకు ధీటుగా విద్యాబోధన

- పోస్టుల మంజూరులో రాష్ట్రంలోనే అగ్రగామి
- పకడ్బందీగా ఉపాధ్యాయుల బదిలీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ప్రజాశక్తితో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కార్పొరేట్ స్థాయి విద్యాబోధనకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్ పాల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ కనబరచి పోస్టులను రాష్ట్రంలో కనివిని ఎరగని రీతిలో మంజూరు చేసిందన్నారు. ఉపాధ్యాయ బదిలీలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. డిఈఓ శ్యామ్యూల్ పాల్ ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు...

విద్యా సంవత్సరానికి మీ ప్రణాళికలు ఏమిటి?

డిఈఓ : జూన్ నెల నుండి ప్రారంభమైన విద్యా సంవత్సరం ఏడాది వినూత్నంగా ప్రారంభం కానుంది. ఏ పాఠశాలలో కూడా టీచర్ల సమస్య అన్నది లేకుండా విద్యా సంవత్సరం కొనసాగుతుంది. పాఠశాలలు తెరవగానే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేయడం జరుగుతుంది. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు డిజిటల్ పాఠాలను కూడా బోధించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగింది.



జిల్లాకు ఎన్ని పోస్టులు వచ్చాయి?

డిఈఓ : జిల్లా కలెక్టర్ కృషివల్ల కన్వర్షన్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్స్ కింద 251 పోస్టులు ఆదర్శ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులుగా మంజూరయ్యాయి. సర్ప్లస్‌గా ఉన్న 97 పోస్టులను అవసరమైన ఖాళీలకు అనుగుణంగా కన్వర్ట్ చేయడం జరిగింది. కొత్తగా 86 హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 957 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 406 యస్జీటీ పోస్టులు కలుపుకుని మొత్తం 1449 మంజూరయ్యాయి. అలాగే జిల్లాలో 97 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు హై స్కూల్లు గా ఉన్నతీకరించడం జరిగింది. కాబట్టి ఈ పోస్టుల భర్తీ తో జిల్లా విద్యాశాఖ మరింత బలోపేతం కానుంది. రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇన్ని పోస్టులు మంజూరు అవ్వలేదు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఎలా సాగుతుంది?

డిఈఓ : ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి జిల్లాలో 2798 అన్ని కేటగిరీలలో ఖాళీలు ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులు 5 మరియు టీచర్లు 8 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన ఖాళీలు 2713 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కన్వర్ట్ ద్వారా 251 ఎస్‌జిటి కన్వర్ట్ ద్వారా 93 పోస్టులు అప్ గ్రేడ్ ద్వారా 100 పోస్టులు, కొత్తగా సృష్టించిన ఖాళీలు 1449, సర్ ప్లస్ షిఫ్ట్ ద్వారా 1143 పోస్టులు కలిపి మొత్తం 8047 జిల్లావ్యాప్తంగా ఖాళీలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఖాళీలు ఉన్న జిల్లాగా కర్నూలు గుర్తించాం.

ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరుగుతాయా?

డిఈఓ : అడ్డదారి బదిలీలకు కాలం చెల్లింది. ఆన్లైన్ విధానం ద్వారా బదిలీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. ఎవరి పాత్ర ఉండదు. ఎవరి ప్రోద్బలము ఉండదు. బదిలీలు చేయిస్తామని చెప్పే పుకార్లు నమ్మొద్దు. బదిలీల ప్రక్రియ కంటే ముందు ప్రతి టీచర్ సమాచారాన్ని ప్రభుత్వం ఆన్లైన్ చేసేసింది. ఏ చిన్న అవాంతరం లేకుండా డేటా నమోదు చేసింది. ఒకసారి దరఖాస్తు చేసుకున్నామంటే నిబంధనలకు అనుగుణంగా బదిలీ జరిగిపోయినట్టే.

ఉపాధ్యాయుల కొరతను అధిగమించినట్టేనా?

డిఈఓ : గత ఏడాది ఉపాధ్యాయుల కొరత బాగా వేధించింది. అందుకే వర్చువల్ స్టూడియో తీసుకొచ్చి అందులో నుంచి విద్యార్థులకు క్లాసులు చెప్పించే పనిచేశాం. అది మెరుగైన ఫలితాలు ఇచ్చింది. అది నిరంతరం జరిగే ప్రక్రియ. ఈ వర్చువల్ నిరంతరం కొనసాగుతుంది. డీఎస్సీ నియామకాలు పూర్తయితే టీచర్ల కొరత సమస్య ఉండదు. అది కూడా యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతుంది.

మధ్యాహ్న భోజనం పథకం ఎలా నడుస్తోంది?

డిఈఓ : రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించింది. నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం కొనసాగుతోంది. ఎక్కడైనా నాణ్యత లేదని మా దృష్టికి వస్తే తక్షణమే ఆ ఏజెన్సీలను రద్దుచేసి కొత్త వాళ్ళని నియమించడం జరుగుతుంది. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.

జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు? నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు ? దీనిపై మీ స్పందన ఏమిటి?

డిఈఓ : ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి విపరీతమైన ప్రచారం నిర్వహించరాదు. ప్రభుత్వ్నిబంధనలను ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడం.



'తుంగభద్ర'కు జలకళ

ప్రజాశక్తి - కౌతాళం

కర్ణాటక రాష్ట్రంలో భారీగా వర్షం కురవడంతో తుంగభద్ర నదిలో జల కళ సంతరించుకుంది. ఆదివారం కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షపు నీరు తుంగభద్ర నదిలో వచ్చి చేరుతోంది. అలాగే శనివారం రాత్రి కూడా కౌతాళం మండలంతో పాటు కర్ణాటకలోని మాన్వి, సింధనూర్, సిరుగుప్ప, బళ్లారి ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి హగరి నది నిండు కుండలా ప్రవహిస్తుంది. హగరి నదిలో నీటితో పాటు నది పై భాగంలో కురిసిన వర్షపు నీరు కూడా తుంగభద్ర నదిలోకి చేరడంతో నీటితో కళకళలాడుతున్నది. తుంగభద్రమ్మ గలగల సవ్వడితో గ్రామాలు దాటుతూ మంత్రాలయం వైపు పరుగులు తీస్తుంది. అలాగే కర్నూలు నగరంలో సాయంత్రి చిన్నపాటి వర్షం కురిసింది. నగరంలోని చిత్తారి వీధికి చెందిన మునగల నాగమ్మ ఇంటి గోడ కూలింది.



కర్నూలు చిత్తారి వీధిలో కూలిన గోడ

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. .

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాల సూచన నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఏదైనా అవసరం ఉన్నా, సమాచారం అంద చేయాలన్నా కంట్రోల్ రూమ్ నెంబర్ 08518-277305 కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

21న డిఇఒ కార్యాలయం ముట్టడి

- జయప్రదం చేయండి : ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యారంగ సమస్యలపై ఈ నెల 21న చేపట్టే డిఇఒ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు ఉపాధ్యాయులను కోరారు. ఆదివారం కర్నూల్ నగరంలోని ఎస్‌టియు భవనంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కర్నూలు జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిఆర్‌టియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణా నిధి మూర్తి, అప్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, భాగస్వామ్య సంఘాల నాయకులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్, ఏపిటిఎఫ్-1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, ఎపిటిఎఫ్-257 జిల్లా అధ్యక్షుడు రంగన్న, హెచ్‌ఎంఎ అసోసియేషన్ నాయకులు హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. పాఠశాలల పునర్విజన, క్రమబద్ధీకరణ చేయుటకు ప్రభుత్వం 19, 20, 21 ఉత్తర్వులను విడుదల చేసిందన్నారు. ఈ ఉత్తర్వులు కొత్త ప్రయోగాలుగా, అసంబద్ధంగా ఉన్నాయన్నారు. అసంబద్ధాలని తొలగించాలని ప్రభుత్వానికి నోటీసులు అందజేశామన్నారు. ఈ మేరకు ఈ నెల 21న ఉమ్మడి జిల్లా కేంద్రంలో, 23న అమరావతిలోని విద్యా భవన్ ముట్టడి కార్యక్రమాలను ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పక్షాన చేపడుతున్నట్లు తెలిపారు. బదిలీలలో, ప్రమోషన్లలో ఉన్న అసంబద్ధమైన విషయాలను తొలగించిన తర్వాతనే బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు.



జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో అభివాదం తెలుపుతున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక సంఘాల నాయకులు

నేటి నుండి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుండి ఈ నెల 27వ తేదీ వరకు జరుగనున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 465 పాఠశాలల నుండి 17,129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో రెగ్యులర్ 10865 మంది, ప్రైవేట్ 5532 మంది, ఓపెన్ స్కూల్ 736 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు 69 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 69 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించారు. 27 ప్రశ్నాపత్రాల స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. పరీక్షల పర్యవేక్షణకు ముగ్గురు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

పెళ్లింట విషాదం

- వధువు సోదరుడు మృతి - మరో ఇద్దరికి గాయాలు
- వరుడి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం - హులేబీడు సమీపంలో సంఘటన

ప్రజాశక్తి - ఆలూరు

తెల్లవారితో పెళ్లి జరిగి ఆనందంగా గడపాల్సిన కుటుంబంలో అనుకోని రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. అక్కను పెళ్లి కుమార్తెగా చేసి బావ గారి ఊరికి తల్లిదండ్రులు, బంధువులను పంపిన తమ్ముడు తను మిత్రులతో కలిసి బైక్‌పై వెళ్తుంగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. దీంతో పెళ్లింట బాజాభజంత్రీలు మూగబోయాయి. వివరాలు... ఆస్పరి గ్రామానికి చెందిన తిప్పన్న, శకుంతలమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఆనంద్ ఉన్నారు. రెండో కుమార్తె మహేశ్వరిని హొళగుంద మండలం వందవాగిలి గ్రామానికి చెందిన లింగప్పతో పెళ్ళి నిశ్చయించారు. ఆదివారం పెళ్ళి ముహూర్తం కావడంతో శనివారం రాత్రి పెళ్లి కూతురితో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు వందవాగిలికి చేరుకున్నారు. వధువు సోదరుడు ఆనంద్(21) గుంటూరులోని ఆర్‌వి ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం బి.టెక్ పరీక్షలు ముగించుకొని అక్క పెళ్ళిచకి వచ్చాడు. అక్క పెళ్లికి తన మిత్రులు తిమ్మప్ప, పూర్ణ చంద్ర వచ్చారు. ఆనంద్ మిత్రులతో కలసి పల్సర్ బైక్‌పై ఆస్పరి నుండి వందవాగిలికి బయల్దేరారు. రాత్రి 10 గంటల సమయంలో ఆలూరు వై జంక్షన్ నుండి హులేబీడు గ్రామ మధ్యలో ఎదురుగా వచ్చిన జైలో కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆనంద్ అక్కడకక్కడే మృతి చెందాడు. తిమ్మప్పకు తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్వల్పంగా గాయపడిన పూర్ణ చంద్రను ఆదోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన తిమ్మప్పది ఆస్పరి మండలం చిగిలి గ్రామం. పూర్ణచంద్రది ప్రకాశం జిల్లా కంభం ప్రాంతానికి చెందిన వారు.



మృతుడు ఆనంద్ (ఫైల్)

తిప్పన్న కుటుంబంలో అలుముకున్న విషాద ఛాయలు

తిప్పన్న వ్యవసాయం చేస్తూ తన కొడుకు ఆనంద్ ను ఉన్నత చదువు చదివిస్తున్నాడు. ఉదయ నుండి రాత్రి వరకు పెళ్ళి పనుల్లో సరదాగా గడిపిన ఆనంద్ మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పెళ్ళికి వచ్చిన బంధువులు రోధిస్తున్న తీరు పలువురిని కలచివేసింది. పెళ్లికూతురు తమ్ముడు ఆనంద్ మృతి చెందాడన్న విషయం తెలుసుకొని పెళ్ళి అర్ధాంతరంగా వాయిదా వేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'హంద్రీపై వంతెన నిర్మించాలి'

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

శరీన్ నగర్ నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెండు ప్రాంతాల మధ్య ఉన్న హంద్రీనదిపై వంతెన నిర్మించాలని క్రాంతి యువజన సంఘం అధ్యక్షులు నాగ మద్దిలేటి డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజా వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. కల్లూరు అర్బన్ శరీన్ నగర్ ప్రాంతం 1974లో ఏర్పడిందని, ఇది విస్తరిస్తూ అనేక కాలనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఇక్కడ పేదలు, కూలీలు జీవిస్తున్నారని చెప్పారు. వీరందరూ హంద్రీనదికి అవతల వైపున ఉన్న ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు వెళ్లి రోజువారీ కూలి పనులు చేసుకుని వస్తుంటారని తెలిపారు. 44వ నెంబర్ జాతీయ రహదారిపై వెళ్తుండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే రోజువారీ సంపాదనలో సగానికి పైగా ఆటోల చార్జీలకే వెళ్తున్నాయని, రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంతంలో హంద్రీ నదిపై వంతెన నిర్మించాలని 2018లో నాటి ప్రజాప్రతినిధులను కలిసి ప్రపోజల్ దరఖాస్తులు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి అర్జీలు ఇచ్చామని తెలిపారు.

ఎమ్మెల్యే మానవత్వం

పత్తికొండ : క్రిష్ణగిరి మండలం ఎరుకులచెరువు మార్గం మధ్యంలో ఆదివారం ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న వ్యక్తులకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తులకు గాయాలయ్యాయి. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ అదే మార్గంలో వెళ్తుండగా చూసి వారిని మానవత్వంతో 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

వైద్యరంగంలో పద్మ విభూషణ్ అవార్డు పొందిన డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కెబి.కృష్ణ మోహన్ స్మారక ఉపన్యాసం చేశారు. అనంతరం సన్మాన గ్రహీత డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీ, డబ్బా పాలు పట్టడం, ఆరు నెలలలోపు పిల్లలకు యాంటీబయోటిక్‌ను వాడటం వల్ల శరీరంలో చెడ్డ బ్యాక్టీరియా వస్తుందన్నారు. ఈ మూడింటిని నియంత్రిస్తే మనిషిలో మంచి బ్యాక్టీరియా వస్తుందని తెలిపారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి ప్రపంచ గ్యాస్ట్రోఎంట్రాలజీలో పేరొందిన వైద్యుడని, ఆయన చదువు కర్నూలు మెడికల్ కాలేజీలో సాగిందని, అనేక గోల్డ్ మెడల్స్, వైద్య రంగంలో అనేక ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి పద్మశ్రీ, పద్మ భూషణ్ లాంటి అత్యున్నత పురస్కారాలను పొందారని కొనియాడారు. భవిష్యత్తులో నోబుల్ బహుమతి, భారతరత్న లాంటి అవార్డులు కూడా రావాలని ఆకాంక్షించారు. డాక్టర్ జయరాం, డాక్టర్ కెబి కష్ణ మోహన్ కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా, పది సంవత్సరాలు ఆస్పత్రి సూపరింటీండెంట్‌గా, మెడిసిన్, హాస్పటల్లో అనేక విభాగాల్లో పని చేశారన్నారు. ఐఎంఎ జిల్లా కార్యదర్శి డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, వైద్యులు వెంకట రంగారెడ్డి, మాధవి శ్యామల, భవాని ప్రసాద్, మహేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్, లక్ష్మీబాయి, బాలముద్దయ్య, శివ శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, విష్ణు ప్రియ, ఉమామహేశ్వర్ రెడ్డి, మంజులాబాయి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ డి నాగేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు

హెచ్ఐవితో జీవిస్తున్న వారిని ఆదరించండి

- జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

హెచ్ఐవితో జీవిస్తున్న వారికి అండగా ఉంటూ ఆదరించాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. హెచ్ఐవితో పోరాడిన వారిని స్మరించుకునేందుకు, హెచ్ఐవితో జీవిస్తున్న వారి పట్ల వివక్షను రూపుమాపేందుకు, హెచ్ఐవి నియంత్రణలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకునేలా జాగృతం చేసేందుకు అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే నాడు ప్రతి ఒక్కరూ ప్రతిన పూనాలని కోరారు. హెచ్ఐవితో మరణించినవారికి సంఘీభావంగా ఆదివారం సర్వజన ఆస్పత్రిలోని క్షయ నియంత్రణ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, ఎఆర్‌టి కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉదయిని, లెప్రసీ విభాగం డిపిఎమ్ఒ సుబ్రమణ్యం, విహెచ్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరమ్మ, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షులు సుధారాణి, నాగరాజు, లింక్ వర్కర్స్ స్కీం పిఆర్‌పి నాగరాజు, రిజర్వేషన్ ఎస్ఆర్ఇడి ప్రాజెక్ట్ మేనేజర్ మునీర్, కౌన్సిలర్లు గౌస్ బాషా, మహ్మద్, వినోద్, నెల్సన్, విజయ్, జగదీశ్వరుడు, ల్యాబ్ టెక్నీషియన్లు మధుబాబు, సుధాకర్ రెడ్డి, లింక్ వర్కర్ స్కీమ్ సిబ్బంది చక్రవర్తి, మాబున్ని, చిట్టి రాణి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



ఆడబిడ్డ నిధికి ఎగనామం

- నగరంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వైసిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఆడబిడ్డ నిధి సంక్షేమ పథకానికి కూటమి ప్రభుత్వం ఎగనామం పెట్టిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భారతి విమర్శించారు. ఆదివారం కర్నూలు నగరంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చెప్పిన పథకాల్లో ఆడబిడ్డలకు ఏ ఒక్క పథకం ఇవ్వడానికి ముందు రావడం లేదని తెలిపారు. ఆడబిడ్డలను మోసం చేస్తోందని మండిపడ్డారు. కర్నూలు నియోజవర్గ టౌన్ అధ్యక్షులు మంగమ్మ, 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ, రాధిక పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

తైక్వాండో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సాధన చేసే పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల ఏజిఎం రమేష్ కుమార్, న్యాయవాది శ్రీనివాసులు (వాసు) హాజరై క్రీడా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం రమేష్ కుమార్ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ వారు వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు సాధన చేసేందుకు పరికరాలు, సర్టిఫికెట్లు అందజేయడం హర్షదాయకం అన్నారు. న్యాయవాది శ్రీనివాసులు ఎన్నో ఏళ్ల నుంచి శిక్షణ ఇస్తున్న మాస్టర్ టి వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అజయ్, తేజ, సూర్య, భార్గవ్, మల్లికార్జున, తిలక్, అఖిల్ పాల్గొన్నారు.



పరికరాలను అందజేస్తున్న దాతలు

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పత్తికొండ

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించిందని కెడిసిసి బ్యాంకు మాజీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా ప్రాంగణంలో వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ భాస్కర్ కంటి శిబిరంలోని వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. 45 మంది కంటి ఆపరేషన్ కోసం కర్నూలులోని విశ్వ భారతి హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు తెలిపారు. వైసిపి నాయకులు కొమ్ము నెట్టికల్, ఎంపిటిసి రంగస్వామి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అ'పూర్వ' సమ్మేళనం

- పెద్దపాడు జడ్‌పిహెచ్ఎస్‌లో 1999- 2000 విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పెద్దపాడు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1999- 2000 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అప్పటి హిందీ ఉపాధ్యాయులు శేషఫణి శర్మ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. పిఈటి కృష్ణారెడ్డి, తెలుగు ఉపాధ్యాయురాలు సరస్వతి, గణితం ఉపాధ్యాయరాలు ప్రభావతి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు టివిఎల్ పద్మ మాట్లాడుతూ 25 ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంత బిజీగా ఉన్నా కుటుంబానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. పిల్లలను బాగా చదివించాలని, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని తెలిపారు. కలిసి చదువుకున్న వారిలో ఎవరికైనా కష్టం వస్తే స్నేహితులందరూ ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువా, మెమొంటోతో సత్కరించారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు

సిఎం పర్యటనలో వినతి.. ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



కర్నూలు నగరంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దేవనకొండ మండలం నేలతల మర్రి గ్రామ నివాసి తగరం సువర్ణమ్మ తన భర్త అనారోగ్య రీత్యా ఆర్థిక సహాయం చేయాలని సీఎంకు విన్నవించుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా రూ.5 లక్షల రూపాయల చెక్ ను తగరం సువర్ణమ్మ బంధువు దినకర్‌కు అందచేశారు.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్‌లో సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు నగరంతో పాటు అన్ని మండల మున్సిపల్, రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నేరుగా ఇక్కడికి బాధితులు విచ్చేసి తమ సమస్యలను విన్నవించుకోవాలన్నారు.

టౌన్ మోడల్ తెలుగు టీచర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎ.శ్రీనివాసరెడ్డిని డాక్టరేట్ వరించింది. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయన తెలుగు వెలుగు పత్రికల్లోని కథలు-పరిశీలన అనే అంశంపై సిద్ధాంత పత్రాన్ని సమర్పించారు. ఈ అంశంపై ఆయనకు మార్గదర్శకులుగా విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఆర్.రాజేశ్వరమ్మ వ్యవహరించారు. కథల్లోని సామాజిక, మానవీయ కోణాలను శ్రీనివాస రెడ్డి ఆవిష్కరించడంతో ఆయనకు కమిటీ డాక్టరేట్ ఇచ్చింది. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్‌లు హర్షం ప్రకటించారు.

వెంకటేష్ హత్య కేసు నిందితుని అరెస్టు


- డీఎస్పీ వెంకట్రామయ్య

ప్రజాశక్తి-ఆలూరు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

హాలహర్వి మండలం అమృతాపురం పెద్ద వెంకటేష్ హత్య కేసు ప్రధాన నిందితుడు కంటినేని సోమన్నను అరెస్టు చేసినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. ఆదివారం ఆలూరు సర్కిల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గతనెల 25న అమృతాపురం గ్రామానికి చెందిన కంటినేని పెద్ద వెంకటేష్ హత్యకు గురయ్యారని తెలిపారు. మృతుని బంధువు కంటినేని సోమన్నకు వడ్డీకి డబ్బు ఇచ్చి ప్రామిసరి నోటు రాయించుకున్నారని, సోమన్న కొన్నిరోజుల తర్వాత కొంత డబ్బు కట్టినా తనకు డబ్బు ఇవ్వలేదని మృతుడు వెంకటేష్ సోమన్నపై కోర్టులో కేసు వేశారని చెప్పారు. అప్పటి నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండగా అనంతపురం సెట్టురులో సోమన్న తన భార్యపిల్లలతో అక్కడే ఉండి పొలాని కౌలుకు తీసుకొని జీవిస్తున్నారని తెలిపారు. అమృతాపురంలో ఉన్న తన పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి పెద్ద వెంకటేష్ సాగు చేసుకొంటున్నాడని, తనకు జరిగిన అన్యాయాన్ని జీర్ణించుకోలేక హోళగుందకు చెందిన చాకలి నాగరాజు, అమృతపురానికి చెందిన నటరాజు గౌడ్, హరిజన ఈరన్న, భోగప్ప, సోమన్న బావ మరిది ధనుంజయ సహాయంతో పెద్ద వెంకటేష్‌ను పథకం ప్రకారం హత్య చేశారని తెలిపారు. సోమన్నను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు, మిగిలిన ఐదుగురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. సిఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐలు మహబూబ్ బాష, చంద్ర పాల్గొన్నారు.

యువత ఆర్మీలో చేరాలి


మేజర్ వినోద్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

దేశం కోసం యువత ఆర్మీలో చేరి పుణ్య భూమి రుణం తీర్చుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ దేవ రాజ్ దోక, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి రమేష్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో ఆర్మీ మేజర్ వినోద్‌ను పూలమాల, శాలువాతో సన్మానం చేశారు. రాజస్థాన్లో ఆర్మీలో మేజర్‌గా విధులు నిర్వహిస్తూ సెలవుపై ఆదోనికి వచ్చిన వినోద్ ను పలువురు అభినందించారు. వారు మాట్లాడుతూ వినోద్ ఆర్మీలో మేజర్‌గా బాధ్య తలు నిర్వర్తించడం గర్వనీయమన్నారు. సాధారణ తాపీ మేస్త్రి రాజు కుమారుడు ఈ స్థాయికి ఎదగడం ఆదర్శనీయమన్నారు. చదువుతోపాటు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్మీ త్రివిధ దళాలలో యువత చేరి దేశం కోసం సేవ చేయాలని కోరారు. మేజర్ వినోద్ మాట్లాడుతూ యువత దేశభక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఇప్పుడిప్పుడే సౌత్ ఇండియా నుండి కూడా ఆర్మీలో ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. లక్ష్యంతో చదివి ఆర్మీలో ఉద్యోగాలు పొందితే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఇండియన్ ఆర్మీ తిరుగు లేని శక్తిగా ఉందన్నారు. ఎలాంటి కుట్రనైనా దేనినైనా ఎదుర్కొనే సత్తా ఉందన్నారు. ఆర్మీలో చేరే వారికి తమ వంతు సాయం ఉంటుందని వినోద్ తెలిపారు. ఎన్ఎస్‌యువై రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనిత్, చేతన్, సాయినాథ్ ఉన్నారు.

సామాజిక సేవలో పాలు పంచుకోవాలి

- అవోపా రాష్ట్ర సెక్రటరీ సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని అవోపా రాష్ట్ర సెక్రటరీ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం ప్రమాణ స్వీకారం మెట్రో ఫంక్షన్ హాలులో చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన అవోపా సెక్రటరీ సుబ్బారావు, కన్వీనర్ ప్రతాప్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, మాజీ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కాకుబాళ్ నగేష్ మాట్లాడారు. పట్టణంలో సీజన్ల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గర అవ్వాలన్నారు. అవోపా పట్టణ నూతన అధ్యక్షులుగా వంకదారు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శిగా ఎస్.రఘు, కోశాధికారిగా వై.వెంకటేశ్వర్లు, 15 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదోని అవోపా మహిళ విభాగం నూతన అధ్యక్షులుగా వంకదారు మమతాశ్రీ, 13 మంది మహిళలు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం తప్పదు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రభుత్వం ఉంది కదా అని రెడ్ బుక్‌తో కక్ష సాధింపు చర్యలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదని ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక అతిథి గృహంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మాజీ ఐఎఎస్ అధికారి ధనుంజయ్య రెడ్డి, మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్టులను చూస్తే ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని తెలిపారు. లిక్కర్ స్కాం జరిగిందంటు విచారణ పేరుతో ఐఎఎస్ అధికారి ధనుంజయ్య రెడ్డి, అప్పటి ఓఎస్డీ కష్ణమోహన్ రెడ్డి ని అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 43 వేల బెల్టు షాపులు తీసివేయడం, 4380 పర్మిట్ రూంలు రద్దు చేయడం జరిగిందన్నారు. గత టిడిపి హయాంలో 25 వేల కోట్ల లిక్కర్ స్కాం జరిగిందని సిఐడీ అధికారులు నిర్ధారణ చేయడం జరిగిందని 69 శాతం మద్యం అమ్మకాలు జరిగితే వైసిపి హయాంలో మద్యం అమ్మకాలు తగ్గుతు వచ్చాయన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు చేయలేక ప్రజలను దృష్టి మళ్లించేందుకు వైసిపి నేతలను అప్పటి అధికారులు, సోషల్ మీడియా కార్యకర్తలు లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఎంత మంచి వాడో అంతే మెండి వాడని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదని కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు కేసులు, జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లవైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ఉపాధ్యక్షులు గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, నాయకులు జనార్దన్ రెడ్డి, చాకలి రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

అనారోగ్యాలతో బాధ పడుతున్న వైసిపి నాయకులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరామర్శించారు. రామచంద్ర నగర్‌లో నివాసముంటున్న వడ్డే బాలరాజు, రామకృష్ణలు కొంత కాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, ధశరథ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, జనార్ధన్ రెడ్డి, వడ్డే నారాయణతో కలిసి బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి అధైర్య పడొద్దని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాంపురం రెడ్డి సోదరుల వీరాభిమాని రవి కోరిక మేరకు వారి ఇంటికి కూడా వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి కాసేపు ముచ్చటించారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

స్థానిక పరిమళ కల్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధువు తరపున చాకలి రామలింగ అంజినయ్య, పెళ్లి పెద్దల ఆహ్వానం అందుకున్న ఆయన కల్యాణ మండపం చేరుకున్నారు. ఆయనకు పూలమాల వేసి శాలువాతో వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డికి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్యకు నాయకులు జనార్ధన్ రెడ్డి, పెట్రోల్ బంకు శ్రీనుకు పెళ్లి పెద్దలు చాకలి భీమయ్య, ఆయన కుమారుడు కృష్ణ, రాము, రమేష్ శాలువాతో సన్మానించారు.

కోసిగిలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - కోసిగి

పహల్గాం ఉగ్రదాడికి ప్రతికారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయాన్ని అభినందిస్తూ దేశ సైనికులకు సంఘీభావంగా కోసిగిలోని ప్రధాన రోడ్డులో ఆదివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, పలువురు నాయకులు హాజరయ్యారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ నుంచి సర్కిల్ వరకు భారీ జెండాతో ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు ముత్తు రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

మురుగునీటిని తొలగించిన అధికారులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఎరిగేరి గ్రామంలో బదినేహల్ క్రాస్‌లో నిల్వ ఉన్న మురుగునీటిని అధికారులు ఆదివారం తొలగించారు. ప్రజాశక్తి దినపత్రికలో 'ప్రతిజ్ఞకే పరిమితమా..!', ఆచరణలో నిర్లక్ష్యమా అనే శీర్షికన ఆదివారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. బ్లాక్ అయిన డ్రెయినేజీ పైపులో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ను ట్రాక్టర్ ద్వారా, ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి పంచాయతీ కార్మికులతో బయటకు తీయించారు. బస్టాండ్ షెల్టర్, ఆరోగ్య కేంద్రం సమీపంలో నిల్వ ఉన్న మురుగునీరు బయటకు పోయింది. గ్రామస్తులకు మురుగునీటి వల్ల వస్తున్న దుర్గంధం ద్వారా విముక్తి లభించింది.



ఆదోనిలో ఘనంగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించి స్వేచ్ఛ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఆదోనిలో చేపట్టిన తిరంగా ర్యాలీ దిగ్విజయంగా సాగింది. మున్సిపల్ కార్యాలయం నుండి టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేతబూని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డి, మీనాక్షి నాయుడు, ప్రకాష్ జైన్, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. మున్సిపల్ మైదానం నుండి మున్సిపల్ రోడ్డు మీదుగా వైఎస్ఆర్ విగ్రహం, అంబేద్కర్ విగ్రహం, ఫేమస్ కూడలి వరకు ప్రదర్శన సాగింది. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ దేశ సమగ్రతకు సార్వభౌమత్వానికి బంధం కలిగించే ఎలాంటి దుష్టశక్తులను ఎదుర్కొనే సత్తా మన జవాన్లకు ఉందన్నారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని సరిహద్దుల్లో పహారా కాస్తున్న జవాన్లకు దేశం యావత్తు అండగా ఉంటుందన్నారు. తీవ్రవాదం మానవ సమాజానికి చేటన్నారు. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు దేశానికి అండగా నిలవాలని పేర్కొన్నారు

రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటన : పాకిస్తాన్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, జనసేన ఇన్చార్జి మల్లప్ప, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి రమేష్ యాదవ్, సిపిఐ నాయకుడు వీరేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ శాంతా, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు సూరం భాస్కర్ రెడ్డి గుడిసె ఆది కృష్ణమ్మ, సౌదీ రాహుప్, రామచంద్రప్ప, శ్రీకాంత్ రెడ్డి, ముజీబ్ అహ్మద్, మారుతి నాయుడు సిద్ధార్థ నాయుడు పాల్గొన్నారు.


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నేడు చైర్మన్ ఎన్నిక..!

- మున్సిపల్ చైర్మన్‌గా లోకేశ్వరి

ఫొటో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ సోమవారం జరగనుంది. మున్సిపల్ కౌన్సిల్ హాలులో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆధ్వర్యంలో జరిగే ప్రక్రియకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా 42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరిని ఎన్నుకుంటున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, ఫయాజ్, అశోక్ మాట్లాడారు. చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లు అందరూ హాజరు కావాలని, ఇప్పటికే విప్ జారీ చేశామన్నారు. 42 మంది కౌన్సిలర్లు ఉండగా రామలక్ష్మమ్మ ఇటీవల చనిపోగా 41 మంది కౌన్సిలర్లు ప్రస్తుతం ఉన్నారని తెలిపారు. టిడిపి ఒకరు, బిజెపిలో నలుగురు చేరగా 36 మంది వైసిపికి బలం ఉందని చెప్పారు. ఎన్నికకు కౌన్సిలర్లు అందరూ హాజరయ్యేలా చూడాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.


సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వివరాలు ఇస్తున్న నాయకులు

మున్సిపల్ చైర్మన్‌గా లోకేశ్వరి

42వ వార్డు కౌన్సిలర్ సిహెచ్.లోకేశ్వరి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సిహెచ్.లోకేశ్వరి ఇప్పటికే పలు దఫాలుగా కౌన్సిలర్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఈమె తండ్రి తిక్కన్న జడ్‌పి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. లోకేశ్వరి భర్త సిహెచ్.నాగరాజు వైసిపిలో ముఖ్య నాయకులుగా వ్యవహరిస్తున్నారు. లోకేశ్వరి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని కౌన్సిలర్లు ఆశాభావంతో ఉన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ భర్త మృతి

ప్రజాశక్తి - ఆదోని


మృతి చెందిన రాముడు (ఫైల్)

మున్సిపల్ మాజీ చైర్మన్ భర్త, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు కురుబ రాముడు (65) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. రాముడు గత కొంతకాలంగా హైదరాబాదులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత వారం రోజుల క్రితం ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యం నుంచి కోలుకోలేక పట్టణంలోని వెంకన్నపేటలో వారి స్వగృహంలో మృతి చెందినట్లు ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య సరోజమ్మ మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు. ఆయన కోడలు శాంతి ప్రస్తుతం 25వ వార్డు వైసిపి కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఈయనకు నలుగురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, భూపాల్ చౌదరి, చంద్రకాంత్ రెడ్డి, వ్యాపారవేత్త షఫీ, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నజీర్ అహ్మద్, పలువురు నివాళులర్పించారు. ఆదివారం సాయంత్రం హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

- జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోత్స్నదేవి

ప్రజాశక్తి - పత్తికొండ

జులై5న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను జయప్రదం చేయాలని పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి టి.జ్యోత్స్నదేవి కోరారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఆమె న్యాయవాదుల తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదు లు తమ పరిధిలో రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులను గుర్తించి, కక్షిదారులతో మాట్లాడి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు, ప్యానెల్ అడ్వకేట్స్ సూరజ్ నబి, లక్ష్మణ స్వామి నాయుడు, సీని యర్ న్యాయవాదులు ఎల్లారెడ్డి, నాగభూషణ్ రెడ్డి, సత్యనారాయణ, రంగస్వామి, కృష్ణయ్య, మహేష్, ప్రసాద్ బాబు, జటంగి రాజు, నారాయణస్వామి, నరసింహ ఆచారి, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల

హక్కులకు భంగం కలిగిస్తే సహించం

-స్టడీ లీవ్ ఉపాధ్యాయుల పోస్ట్ లను ఖాళీలుగా చూపరాదు

- కెవిపిఎస్, దరసం నేతలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యాశాఖలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల ఉన్నత చదువుల కోసం ఇచ్చిన ఉత్తర్వుల హక్కులకు భంగం కలిగిస్తే సహించబోమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు యస్. దేవసహాయం, దళిత రచయితల సంఘం (దరసం) వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కేవీపీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు యస్.దేవసహయం మాట్లాడుతూ జీవో ఎంఎస్ నెంబర్ 342 మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయులు పదోన్నతుల కోసం ఉన్నత చదువుల నిమిత్తం రెండు సంవత్సరాలు స్టడీ లీవ్‌లో ఉండి చదువుకునే అవకాశంను 1977 నుంచి కల్పించాలని, ఈ కూటమి ప్రభుత్వం 342 జీవోకు విరుద్ధంగా వ్యవహరించడం అనేది ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు అనాది నుండి ఉన్న హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని పేర్కొన్నారు. స్టడీ లీవ్‌లో ప్రభుత్వ నిబంధనల మేరకే తమకున్న అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారే తప్పా నిబంధనలను ఉల్లంఘించి చేయడం లేదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఎప్పుడు అడ్డురాని అసంబద్ధ నిబంధనలను ఈ సంవత్సరం జరిగే బదిలీలల్లో చూపిస్తూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను ఉన్నత విద్యకు దూరం చేయాలనే విద్యాశాఖ తీరును ఖండిస్తున్నామన్నారు. దరసం వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్ మాట్లాడుతూ సెలవులో ఉన్న ఉపాధ్యాయులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా త్వరలో జరిగే బదిలీల్లో స్టడీలీవ్ లో ఉన్న ఉపాధ్యాయుల స్థానాలను ఖాళీలుగా చూపించడం దారుణమని, ఎనిమిది సంవత్సరాలు మారుమూల ప్రాంతాల్లో పనిచేసి వచ్చిన ఉపాధ్యాయుల పోస్టులను ఇప్పుడు బదిలీల్లో ఖాళీలుగా చూపించి స్టడీ లీవ్ పూర్తి అయిన తర్వాత మళ్లీ దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందన్నారు. అలాగే స్టడీ లీవ్ పూర్తిచేసుకుని రెండు మూడు నెలల్లో జాయిన్ అయ్యే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం 342 జీవోకు భంగం కలగకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం అలానే మొండిగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీఉపాధ్యాయులతో పాటు అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిటిఎ రాష్ట్ర కార్యదర్శి మాదన్న, ఉపాధ్యాయులు పరిమళ, బహుజన విద్యార్థి సంఘం నాయకులు పూలచింత వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

ఆర్‌టిఓ కార్యాలయాలను ప్రభుత్వమే నడపాలి

- 20న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- సిఐటియు తాలూకా కార్యదర్శి బి రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఆటో కార్మికులకు నష్టం జరిగే ప్రభుత్వ రవాణా కార్యాలయాలను ప్రైవేటీకరణ ఆపాలిని, ఆర్టీవో కార్యాలయాలను ప్రభుత్వమే నడపాలని సిఐటియు తాలూకా కార్యదర్శి బి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మిక కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా పిలుపు ఆటో కార్మికులు నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతితో రవాణా ఆర్టిఏ కార్యాలయాలను ప్రైవేటీకరణ ఆపాలని కరపత్రాలు ఆటో కార్మికుల స్టాండ్ దగ్గర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి బి రాముడు మాట్లాడుతూ నిరుద్యోగులు ఉపాధి లేక అప్పులు తెచ్చుకొని ఆటో లా ద్వారా జీవనోపాధి గడుపుతున్న ఆటో కార్మికులపై ఆర్థిక భారాలు వేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆటో కార్మికులపై జిఎస్టి పెట్రోల్ డీజిల్ అనేక భారాలు, పోలీసులు చలానాలు పేరుతో ఆర్థికంగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు, ఇటువంటి పరిస్థితుల్లో వికసిత్ భారత్ కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగమైన ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వారి జీవితాలను ప్రమాణాలను మెరుగుపరచాల్సింది పోయి ఆర్టిఏ కార్యాలయంలో ప్రైవేటు వారికి అప్పగిస్తే ఆర్థిక దోపిడీ అధికమవుతుందని అన్నారు. కార్మికుల నష్టపోతారని ఆటో పాసింగ్ డ్రైవింగ్ లైసెన్స్ ద్వారా ఫిట్నెస్ ద్వారా అధిక రేట్లు పెంచి కార్మికుల నుండి నిలువు దోపిడీ చేస్తారని ప్రభుత్వ భరోసా ఉండదని తెలిపారు. జీవో నెంబర్ 21 ద్వారా ఆటో కార్మికులపై కొత్త చట్టాలు తెచ్చి కార్మికులను ఇబ్బంది పాలు చేసే కేంద్ర ప్రభుత్వ చట్టాలను వ్యతిరేకించి నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆటో కార్మికులు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఆటో కార్మిక సంఘం నాయకులు వేణు, బాలు, షబ్బీర్, ఈరన్న గౌడ్, బాషా, నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న రాముడు

విద్యతోనే ఉన్నత స్థాయి

- వాల్మీకి ఉపాధ్యాయ సంఘం

ప్రజాశక్తి - నందవరం




విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలంటే చదువు వల్ల మాత్రమే సాధ్యపడు తుందని వాల్మీకి ఉపాధ్యాయ సంఘం సభ్యులు తెలిపారు. ఆదివారం నందవరం శ్రీమాత బంగారమ్మ అవ్వ దేవాలయం దగ్గర వాల్మీకి మహర్షి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో పదో తరగతిలో 1, 2, 3వ స్థానాల్లో నిలిచి ఉత్తమ ఫలితాలు సాధించిన వాల్మీకి విద్యార్థులను ప్రోత్సహించడానికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. ప్రస్తుత కాలంలో వాల్మీకులు రాజకీయ, విద్యా, వ్యాపార, క్రీడా రంగంలో రాణిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కూడా సవాళ్లను ఎదుర్కొంటూ ఉన్నత పదవులను అలంకరించాలని సూచించారు. మండలంలో 21 మంది వాల్మీకి విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారని, వారిలో 17 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. చదువులో బాలికలు ముందంజ ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవాధ్యక్షులు టి.బాలవెంకటేశ్వర్లు, అధ్యక్షులు బి.మల్లన్న, ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, సలహాదారులు బి.వెంకన్న, వెంకటరెడ్డి, మాధవి, లక్ష్మణ, హుస్సేన్, లింగమూర్తి, రఘునాథ్, రవి, రవిచంద్ర, కిరణ్, శివకుమార్, గజేంద్ర, నారాయణ, భీమశేఖర్, కోదండ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - హోళహర్వి

హాలహర్వి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2007-08లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా సాగింది. పూర్వ విద్యార్థులు కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జయమ్మ, పూర్వ అధ్యాపకులు పిఎస్.ప్రసన్నలక్ష్మి, ఎస్ఎస్.రియాజ్, పిఇటి నాగరాజు, అటెండర్ శేఖర్ మాట్లాడారు. అంతంత మాత్రమే సదుపాయాలున్న నాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం గర్వంగా ఉందన్నారు. 18 ఏళ్ల తర్వాత కూడా తమను గుర్తుంచుకుని సన్మానించడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యార్థులు మారుతి చౌదరి, శంకరప్ప, శేషాబు, బసవరాజ్ పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

దైవందిన్నెలో శ్రీకనకదాసు విగ్రహం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని దైవందిన్నె గ్రామంలో శ్రీభక్త కనకదాసు విగ్రహ ప్రతిష్టాపనను కురువ సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, అమిలియో హాస్పిటల్ ఎమ్‌డి ప్రసాద్, కురువ సంఘం నాయకులు కె.మద్దిలేటి, మార్కెట్ యార్డు చైర్మన్ కురువ మల్లయ్య పాల్గొని భక్త కనకదాసు స్వామివారిని దర్శించుకున్నారు. కురువ సంఘం జిల్లా నాయకులు, టిడిపి నాయకులు కెటి.వెంకటేష్, చెన్నాపురం నాగరాజు, బనవాసి నరసింహులు, ధనంజయ, కృష్ణ, సోగనూరు జగదీష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పార్కులో సౌకర్యాలు మెరుగుపరచాలి

- వైసిపి సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని మాచాని సోమప్ప మున్సిపల్ పార్కులో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ డిమాండ్ చేశారు. ఆదివారం వైసిపి బృందం మాచాని సోమప్ప మున్సిపల్ పార్కును సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్కులో మౌలిక సమస్యలను సమీక్షించి, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. రోజూ వందలాది మంది పట్టణ వాసులు ఉదయం వ్యాయామం, సాయంత్రం విశ్రాంతి కోసం పార్కుకు వస్తున్న నేపథ్యంలో, వారికి ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా చూడాల్సిన అవసరం ఉందని తెలిపారు. పార్కులో గత కొంత కాలంగా నిరుపయోగంగా మిగిలిపోయిన మురుగుదొడ్లను శుభ్రపరిచి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలని కోరారు. పాడైపోయిన వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట పరికరాలను మరమ్మతులు చేయాలని అధికారులను కోరారు. పార్కు పరిసరాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైట్లు, కనెక్షన్లను సురక్షితంగా మార్చాలని, పార్కులో ఉన్న మహేశ్వరుని విగ్రహానికి అవసరమైన మరమ్మతులు చేసి శోభాయమానంగా తీర్చిదిద్దాలని కోరారు. పార్కు అభివృద్ధిలో భాగంగా హరిత విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైడబ్ల్యుసిఎస్ గ్రౌండ్, పార్కు మధ్యలో ఉన్న ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రహదారిని పునర్నిర్మించాలని కోరారు. పార్కు గోడల వెంట పేరుకుపోయిన మురుగు, చెత్తను తొలగించి శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను కోరారు. వైసిపి రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి కదిరికోట సునీల్ కుమార్, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు విశ్వనాథ్ రమేష్, సోషల్ మీడియా అధ్యక్షులు ఎన్ఎమ్‌డి.షరీఫ్, పట్టణ ఉపాధ్యక్షులు కోటకొండ నరసింహులు, పాల శ్రీనివాస్ రెడ్డి, నాగేంద్ర, మాచాని రఘు, ఎస్.ప్రభాకర్, మంజునాథ్, ప్రభాకర్ పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న బుట్టా నీలకంఠ